

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయీ, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయీ... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**అన్నయ్య రెస్టారెంట్‌కి** డ్రైవ్ చేస్తూ "పార్టీవేర్ కొంటే కొన్నావు కానీ ఎక్కువ పార్టీలకి వెళ్ళకు. ఆల్కాహాల్ ఉంటుంది అన్ని పార్టీల్లో. ఫ్రెండ్స్ ఎంత ఫోర్స్ చేసినా తాగకు. చెడలవాట్లన్నీ ముందు 'ఒక్కసారి'తోనే మొదలవుతాయి. కేంపస్‌లో చాలామంది డ్రగ్స్ వాడే వాళ్ళు కూడా ఉంటారు. వాళ్ళకి ఎంత దూరం ఉంటే అంత మంచిది. ఒక్కసారి చేస్తే ఏంకాదు, అదీ ఇదీ అని అనచ్చు. కానీ ఒక్కసారికే నీ బ్రైన్ కెమిస్ట్రీ మారిపోతుంది. ఏ ఉద్యోగానికైనా, ఇన్‌టర్న్ షిప్ కైనా డ్రగ్ టెస్ట్ కంపల్సరీ ఒకసారి టెస్ట్‌లో ఏదైనా తేడా వస్తే జీవితాంతం నీ రికార్డ్‌లో ఉండిపోతుంది. తరువాత ఉద్యోగం దొరకడం చాలా కష్టం" అన్నాడు.

"నేనేమైనా డ్రగ్స్ చేసేదానిలా కనబడుతున్నానా?" కోపంగా అరిచాను.

"నువ్వు చెయ్యవని నాకు తెలుసు. కానీ ఈ ఏజ్‌లో ఫ్రెండ్స్ ఇన్ఫ్లుయెన్స్ ఎక్కువ. అందుకే ముందు కాన్సీక్వెన్సెస్ గురించి చెప్తున్నాను"

"ఫ్రెండ్స్ ఇన్ఫ్లుయెన్స్ ఉంటే ఇండియాలోనే తాగడం మొదలు పెట్టేదాన్ని"

"రోజూ పూర్తయ్యాక నువ్వు ఇంటికెళ్ళి అమ్మ వండింది తిని పడుకోవు. రూం కెళ్ళి రూమ్మేట్స్‌తో ఉంటావు. ఎవరూ కంట్రోల్ చెయ్యరు. నీ లైఫ్ నీ చేతిలో ఉంటుంది. ఒక్క రాంగ్ మూవ్ చాలు లైఫ్ పాడవడానికి"

కోపంతో ఏమీ మాట్లాడలేదు.

"నీ పైన నమ్మకం ఉండబట్టే అంత దూరం పంపిస్తున్నాను. నీమీద నమ్మకంలేక కాదు. పదిమంది కలిసి తప్పుని ఒప్పు అంటే మనం నెమ్మదిగా అదే నిజం అనుకుంటాం. అది తప్పే అని చెప్పేందుకు అక్కడ ఎవరూ ఉండరు. నీ ఇన్నర్ వాయిస్ తప్ప. అందుకే ఇవ్వన్నీ ఇప్పుడే నూరిపోస్తున్నాను" అని పార్కింగ్‌లో కారు ఆపాడు.

లోపలికి ఇద్దరం నిశ్శబ్దంగా నడిచాము. అన్నయ్య చెప్పింది కరెక్టనిపించినా సారీ చెప్పదలచుకోలేదు.

రెస్టారెంట్ లోపల చిన్న అక్వేరియం, పొడుగు షాండిలియర్లు, అందమైన పెయింటింగ్స్ ఉన్నాయి. నేను చుట్టూ చూడ్డం గమనించి "మనం మ్యూజియంకి రాలేదు" అన్నయ్య హేళన చేశాడు.

"ఈ రెస్టారెంట్ ఎంత బావుందో. ఎక్స్‌పెన్సివా?"

"మరీ అంత ఖరీదు కాదు" వెయిటర్ వెంట నడిచి టేబుల్ చేరాము.

మా ఎదురుగా ఒక గ్లాస్ గోడలో జలపాతంలా నీరు పారుతుండడం చూస్తూ ఉండగా "కొంపతీసి అక్కడ ఫోటో తీయమంటావా ఏంటి?" ఎగతాళి చేసాడు.

"లేదు" వెంటనే బదులిచ్చాను.

"మెన్యూ చూడు. వెయిటర్ రాగనే ఆర్డర్ చేద్దాం. ఆకలి దంచేస్తుంది" మెన్యూలో మొదటి పేజీ నాకు అర్థంకాలేదు. అన్నయ్యని అడుగుదాం అనుకునేలోపు వెజిటబుల్ ఫ్రైడ్ రైస్ నాకంట పడింది.

మా చుట్టుపక్కల కూర్చున్నవారిలో కొంతమంది మంచి బట్టలు, మేకప్ వేసుకుని వస్తే, మరికొందరు ఇంట్లో వేసుకునే బట్టలతో, జుట్టు కొప్పేసుకుని వచ్చారు.

"ఏం కావాలి?" నేను అందరినీ గమనించడం చూసి అడిగాడు.

"వెజిటబుల్ ఫ్రైడ్ రైస్"

"ఇంకా?"

"అంతే"

"సూషీ వద్దా?"

"ఏది బావుంటుందో నాకు తెలియదు. నువ్వే ఆర్డర్ చెయ్యవా?"

ఇంతలో వెయిటర్ వచ్చాడు. అన్నయ్య చాట భారతం అంత ఆర్డర్ ఇచ్చాడు.

"అన్ని ఎక్కువౌతాయో" వెయిటర్ వెళ్ళాక చెప్పాను. అన్నయ్య సమాధానం చెప్పకుండా నవ్వాడు.

వెయిటర్ ఆలస్యం చెయ్యకుండా సలాడ్ తీసుకొచ్చాడు.

అన్నయ్య వాళ్ళిచ్చిన చాప్ స్టిక్స్‌ని విరిచి తినడం మొదలు పెట్టాడు. నేను ఫోర్క్‌తో తినడం చూసి "చాప్ స్టిక్స్‌తో తిను" అన్నాడు.

"నాకు రాదు"

"ట్రై చెయ్యి. సూషీ ఫోర్క్‌తో తినలేవు. విరిగిపోతుంది."

చాప్ స్టిక్స్‌ని విరిచేందుకు ఎంత గట్టిగా ఉంటాయో అని బలవంతా ఉపయోగించాను. అది దాదాపు నా చేతిలోంచి ఎగిరి పక్క టేబుల్ మీద పడినంతపనైంది. అదృష్టవసాత్తు అన్నయ్య తప్ప ఎవరూ చూడలేదు. అవి ఎలా పట్టుకోవాలో అర్థంకాక కష్టపడుతుంటే, ఎలా పట్టుకోవాలో అన్నయ్య నేర్పించాడు. ఎంతో ప్రయత్నిస్తే కానీ ఒకే ఒక్క ఆకు కింద పడకుండా నోటిని చేరింది. కొన్ని నిమిషాలకి వేళ్ళు కొంకర్లు పోయాయి. పుల్లలు పక్కన పెట్టి ఫోర్క్‌తో మిగిలిన సలాడ్‌ని రెండు నిమిషాల్లో తినేసాను. వెయిటర్ మా ఇద్దరికి చెరో గిన్నెలో సూప్ తెచ్చాడు. ఇంతకు ముందు ఎప్పుడూ చూడని వాసన.

"ఏం సూప్?" అన్నయ్యని అడిగాను.

"మీ సో సూప్"

గిన్నెలో తెల్లగా, మెత్తగా ఏవో తేలుతున్నాయి. చికెన్ అని అనుమానం వచ్చి అన్నయ్యని అడిగాను.

"అది టోఫు. ఏం పర్లేదు తిను" బదులిచ్చాడు.

మొదట్లో నచ్చకపోయినా తినగా తినగా సూప్ ఎంతో నచ్చింది. గిన్నె ఖాళీ అయ్యేసరికి ఆకలి పెరిగింది. ఇంతలో వెయిటర్ సూషీ తెచ్చాడు. అతను వెళ్ళిపోయాక, "ఆకలి బాగా వేస్తుందా?" అన్నయ్య అడిగాడు.

"నీకెలా తెలుసు?"

"ఆ అబ్బాయి చేతిలో ట్రే చూసి నీ మొహం థౌసెండ్ వాట్స్ బల్బ్‌లా వెలిసిపోతేనూ" నవ్వాడు.

అన్నయ్య ఫటఫటా తన ప్లేట్‌లో కొన్ని ఉండలు పెట్టుకున్నాడు.

"ఇవి ఎలా తినాలి?"

"ఇటువైపువి అస్పరాగస్, కుకుంబర్, ఆవకాడో సూషీ. అటు పక్కవి వెజిటబుల్, అంటే జపనీస్ కూరగాయలతో చేసింది. రెండూ రుచి చూసి ఏది ఎక్కువ నచ్చితే అది తిను"

స్పూన్, ఫోర్క్‌తో తలా ఒకటి నా ప్లేట్‌లో పెట్టుకున్నాను.

"ఇది సాయ్ సాస్ , అది వసాబీ. రెండూ ఈ చిన్నగిన్నెలో కలపాలి. వసాబీ చాలా ఘాటుగా ఉంటుంది. చూసి తినాలి. లేకపోతే కొరబోతుంది. ఇప్పుడు సూషీ దీంట్లో నంచుకుని తినాలి. అల్లం నా కిష్టంలేదు. కావాలంటే నువ్వు తిను."

"అల్లం ఏంటి?" జోక్ చేస్తున్నాడనుకున్నాను.

"సూషీతో పాటు ఇచ్చాడు కదా"

ఎక్కడా కనబడక పోయేసరికి "చిన్న ముక్కేమో కనిపియట్లేదు"

"చిన్న ముక్కేంటి? ఇక్కడ చుట్టి పెట్టుంటే" చూపించాడు.

అది మన అల్లంలా కాక పింక్ రంగులో ఉంది. ఆ స్లైసులన్నీ చుట్టి గులాబీ పువ్వులా ఉంది. "ఇది అల్లమా?" కళ్ళు పెద్దవి చేసి ఆశ్చర్యపోయి అడిగాను.

"అది పికిల్డ్ జింజర్"

ఆకలి వేయడంతో అదేంటో అడగలేదు. ఫోర్క్‌తో తినడానికి ప్రయత్నించాను కానీ అన్నయ్య చెప్పినట్టే విరిగిపోయింది. మరోసారి కూడా అలానే జరగడంతో చాప్ స్టిక్స్‌తో ప్రయత్నించాను. ఆకుల కన్నా పెద్దగా ఉండడం వల్ల

కాబోలు, సలాడ్ కన్నావేగంగా తినగలిగాను. నేను అనుకున్నదానికన్నా ఎంతో బావుంది. వసాబీ ఎంత ఘాటుగా ఉంటుందా అని క్యూరియాసిటీతో నాలికమీద కొంచెం రాసుకున్నాను. దెబ్బకి ప్రాణం లేచింది ఘాటు తలలో తెలిసింది. కళ్ళల్లోంచి నీరు కారుతుండగా నేను నీళ్ళు తాగడం చూసి అన్నయ్య వెంటనే ఫోటో తీసాడు. పింకు రంగు అల్లం ఎలా ఉంటుందా అని ఒక చిన్న ముక్క కొరికాను. మన అల్లంలా కాక కాస్త తీపిగా, ఎంతో రుచిగా ఉంది. అల్లం వాసన కూడా లేదు. ఇందాకటి వసాబీ దెబ్బకి సొయ్ సాస్‌లో ముంచకుండా వట్టి సూషీని అల్లంతో తిన్నాను. వసాబీ ప్రభావం పూర్తిగా తగ్గింది. "సొయ్ సాస్‌తో తిను. తక్కువ వసాబీ కలిపాను. నీకు అసలు అది ఉందని కూడా తెలియదు" అన్నయ్య అనడంతో ప్రయత్నించాను. వట్టి సూషీకన్నా ఇలానే బావుంది.

"ఈ ఉండ చుట్టినవి ఏంటి?" అడిగాను.

చిన్నగా నవ్వి "సీ వీడ్" అన్నాడు.

వాసనొస్తుందేమో అని పరీక్షించాను. కానీ పాచి కంపులేదు. అది గమనించిన వెయిటర్ "ఈస్ ఎవ్రి థింగ్ ఓకే?" అడిగాడు.

"యెస్" నా ప్రవర్తనకి సిగ్గు పడుతూ చెప్పాను.

ఇండియాలో లాగా కాకుండా ఫ్రైడ్ రైస్ పళ్ళెంని నా ముందు పెట్టాడు వెయిటర్.

"ఇదేంటి? గిన్నెలో ఇవ్వరా?" అన్నయ్యని అడిగాను.

"ఇక్కడ ఎవరు ఆర్డర్ చేసింది వాళ్ళకే ఇస్తారు. కావాలంటే ఎక్స్‌ట్రా ప్లేట్ అడగచ్చు"

సలాడ్, సూప్, సూషీతో పొట్ట నిండిపోయింది. అన్నయ్యది వచ్చేలోపు నెమ్మదిగా తిందాం అని ఒక స్పూన్ నోట్లో పెట్టుకున్నాను కానీ రుచీ పచిలేదు. అందులో నేను ఉప్పు, పెప్పర్ వేసుకోవడం చూసి "హాట్ సాస్‌తో తిను" అన్నాడు.

"నువ్వేం ఆర్డర్ చేసావు?"

"నేనేం చెయ్యలేదు. సూషీ చాలా ఫిల్లింగ్"

"మరి ముందే ఎందుకు చెప్పలేదు?"

"నీకు నచ్చుతుందో లేదో తెలియదు కదా"

"నాకూ ఎక్కువైంది" తిడతాడనుకున్నాను.

"టుగో తీసుకెళ్దాం. రేపు లంచ్‌కి తిను" వెయిటర్ ని పిలిచాడు.

బిల్లు, ఒక టుగో బాక్స్‌ని అడిగాడు. నా ఫ్రైడ్ రైస్‌ని అందులో పెట్టేసరికి వెయిటర్ కార్డుని తీసుకొచ్చి "హేవ్ ఎ గుడ్ డే" అని వెళ్ళిపోయాడు.

భుక్తాయాసంతో నేను అన్నయ్య వెంట నడిచి కారెక్కాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story